క్లుప్తంగా

ఎన్‌సీసీతో క్రమశిక్షణ


మాట్లాడుతున్న నేవీ అధికారి పరీక్షిత్‌రావు

కోట: ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతాయని ఇండియన్ నేవీ అధికారి లెఫ్టినెంట్ కమాండర్ పరీక్షిత్‌రావు సూచించారు. తమిళనాడు రాష్ట్రం అరక్కోణం నుంచి విచ్చేసిన ఆయన మంగళవారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండియన్ నేవీ ప్రాముఖ్యతను, ఇండియన్ నేవీలో చేరేందుకు అవకాశాలను వివరించారు. ప్రపంచంలోనే ఇండియన్ నేవీకి ఎంతో గుర్తింపు ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఎన్‌సీసీలో చేరేందుకు మక్కువ చూపాలని కోరారు. ఎన్‌సీసీలో రాణించడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం పరీక్షిత్‌రావును కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ గణేష్, మల్లికార్జున్‌రెడ్డి, మాధవయ్య, శోభారాణి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

రాపూరు: గ్రామాల్లోని ప్రజలకు వైద్యసిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని అడిషినల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. రాపూరు మండలం వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న లెప్రసీ, బీసీజీ వ్యాక్సిన్ తదితర వాటిపై చర్చించారు. లెప్రసీ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. బీసీజీ వ్యాక్సిన్‌ను 60 సంవత్సరాల నిండిన వారికి విధిగా వేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్క వైద్యసిబ్బంది నిత్యం గ్రామాల్లో పర్యటించి అనారోగ్యంగా ఉన్న వారికి వైద్యసేవలు చేయడంతోపాటు దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే వైద్యశాలకు తరలించాలని సూచించారు. వైద్యులు ప్రమీలారాజకుమారి, సూర్యధర్మేంద్ర, డీపీఎంఓ మోహన్‌రావు, సూపర్‌వైజర్ లింగమూర్తి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన


ఎంపీడీఓ కార్యాలయం ముందు ఆందోళన

కలువాయి: ఫీల్డ్ అసిస్టెంట్లుగా రాజీనామా చేయక పోయినా లాగిన్‌లు తొలగించడంపై కలువాయి మండల ఎఫ్ఏలు మండల పరిషత్ కార్యాలయం ముందు మంగళవారం ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మారాక మండలంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారని, ఎంపీడీఓ, ఏపీఓలు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మిగిలిన అందరూ రాజీనామా చేయాలంటున్నారని ఆరోపించారు. తాము రాజీనామా చేయకపోయినా లాగిన్‌లు తొలగించడం అన్యాయమన్నారు. గత నెల జీతాల బిల్లు కూడా ఇప్పటి వరకు పెట్టలేదని, ప్రతి నెలా 27 నుంచి 30వ తేదీ లోగా పెట్టేవారని, ఇంత వరకు బిల్లు పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


షెడ్యూల్ ప్రకారం ఎస్‌ఎంసీ ఎన్నికలు

కలువాయి: మండలంలోని అన్ని పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఎంపీడీఓ ప్రభాకర్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జగిరిన హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. 8వ తేదీ నాడు ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికలు ఎలా నిర్వహించాలనే అంశంపై రిసోర్సు పర్సన్ వల్లూరు కృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. విద్యాశాఖ అధికారులు రేణుక, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట, చెన్నైకి చెందిన రాజస్థాన్ సేవా సంఘ్, మెట్రో మహావీర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్యశాల డాక్టర్లు 196 మందికి కంటిపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు కూడా అందజేశారు. ఇందులో 109 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని ఉచితంగా తిరుపతికి పంపించి వారికి ఆపరేషన్లు చేయించి మళ్లీ ఇంటికి తీసుకొస్తామని నిర్వాహకులు తెలిపారు.

మెరైన్ హోంగార్డు మృతి


రాజేష్ (ఫైల్)

వాకాడు: దుగరాజపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న బి.రాజేష్(33) మంగళవారం మృతి చెందాడు. స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. తూపిలిపాళెం గ్రామానికి చెందిన రాజేష్ 2013 నుంచి దుగరాజపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం తీవ్రంగా విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజేష్ మృతికి మెరైన్ ఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బంది సంతాపం తెలిపి, నివాళులు అర్పించారు. మృతుడికి భార్య లతమ్మ ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చేనేతకు దిక్కెవరు?


తయారు చేసిన చీరను చూపుతున్న చేనేతలు


అచ్చులతుకుతున్న నేత కార్మికురాలు


నూలు వడుకుతున్న మహిళ

రెక్కాడితేగాని డొక్కాడని నేతన్నల జీవితాలు బాగు పడుతున్నాయనుకునే లోపే దుర్భర పరిస్థితుల్లోకి మళ్లీ వెనక్కు వెళ్లే దుస్థితికి చేరుకుంటున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేనేతలపై కపట ప్రేమ చూపించి అధికారం చేపట్టింది. ఆ తరువాత నేతన్నలను పట్టించుకునేందుకు మొండి వైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినా అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు భరోసాగా ఒక్క హామీ కూడా ప్రకటించిన దాఖలాల్లేవు.

– వెంకటగిరి రూరల్/సైదాపురం

- ప్రభుత్వ సాయం కోసం నేతన్నల ఎదురుచూపులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తంతో చేనేతలకు అండ
- ఈ పథకంలో నియోజకవర్గ లబ్ధి రూ.22.96 కోట్లు
- నేడు చేనేత దినోత్సవం

పెరిగిన ధరలు.. తరగని బాధలు..

నేత కార్మికులకు ఒక చీర తయారి చేయడానికి ఆ కుటుంబమంతా రోజు కష్టపడాల్సి వస్తుంది. నూలు, కండెలు తోడుకోవడం నుండి మగ్గం నేసుకోవడం, పూతలు వేయడం వంటి పనుల్లో ఇంటిల్లిపాది తలా ఓ చేయి వేస్తేనే మగ్గం పనులు కొంత మేర సాగుతాయి. చేసిన కష్టానికి తగిన కూలి గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబ నిర్వహణ కష్టతరమవుతుందని నేతన్నలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయలు, విద్యుత్‌చార్జీలు, ఇంటి అద్దె, పిల్లలు చదువుల ఫీజులుతోపాటు కుటుంబ నిర్వహణ ఖర్చులకు సరిపడా సంపాదన ఉండడం లేదు. దీంతో నెల వచ్చే సరికే నేతన్నలకు తలకు మించిన భారంగా మారుతోంది. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి నేతన్నల కుటుంబాలను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టి ఉచిత విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

అండగా మారిన నేతన్న నేస్తం

మోడు బారిన మగ్గం బతుకులకు గత రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగులు అద్దింది. చేనేత పరిశ్రమ అభివృద్ధికి, చేనేత కార్మికుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తూ వచ్చింది. ఆధునిక టెక్నాలజీతో నేత పనులు సాఫీగా సాగించుకునే విధంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి శ్రీకారం చుట్టారు. ఆర్థికంగా చితికిపోయిన చేనేత కుటుంబాలకు అండగా నిలిచారు. ఈ పథకం కింద అర్హత కలిగిన చేనేత కుటుంబానికి నెలకు రూ.2,000 చొప్పున ఏడాదికి రూ.24 వేలు


మగ్గం నేస్తున్న నేత కార్మికుడు

ఒకే సారి నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే జమ చేసే వారు. వరుసగా ఐదో విడతలుగా నేతన్న నేస్తం డబ్బులు గత ప్రభుత్వం వారి ఖాతాల్లోకి జమ చేసింది. ఐదు విడతల్లో ఒక్కో నేత కార్మికుడికి రూ.1.20 లక్షలు నిధులు అందించారు. అయితే ప్రస్తుతం అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం నేత కార్మికులకు సరైన ప్రోత్సాహం, ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసపోయే పరిస్థితి తలెత్తుతోంది. అప్పుల బాధతో అనేక మంది నేతన్నల జీవనం కష్టతరంగా మారుతోంది.

నేతన్నల అభివృద్ధికి బాటలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మరో వైపు జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద క్లస్టర్లుగా డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతోపాటు నూలు కొనుగోలు నుంచి తయారైన చీరలను మార్కెటింగ్ చేసే వరకు ప్రభుత్వం అన్ని దశల్లోనూ సహకారం అందించింది. ఫలితంగా పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు లబ్ధి పొందారు. వృత్తి నైపుణ్యాలు మెరుగు పరుచుకునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా క్లస్టర్లు ఏర్పాటు చేసి వెరైటీ డిజైన్లతో అధునాతన చీరలు నేసేందుకు అవసరమైన డిజైన్‌లు, 240 హుక్స్ మోటరైజ్డ్ లిఫ్టింగ్ డైస్, ఐరన్ ఫ్రేమ్ లూమ్స్‌లాంటి మిషన్లు, మోటార్లు తదితర పరికరాలను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. అధునాతన వస్త్రాలను నేసేందుకు చేనేత కార్మికులకు ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇచ్చారు. ఆప్కో ద్వారా వస్త్రాల కొనుగోలు చేయించారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం నుండి రూ.25,000 సబ్సిడీ కలిగిన రుణాలను మంజూరు చేశారు. 2022-23లో తిరుపతి జిల్లాలో 255 మంది చేనేత కార్మికులకు రూ.1.76 కోట్లు మంజూరు చేశారు. ఈ పథకం ద్వారా వెంకటగిరిలోని భావానారుషి చేనేత క్లస్టర్‌లో 895 మంది చేనేత లబ్ధిదారులకు రూ.1.63 కోట్ల మంజూరు చేసింది. ఎస్‌హెచ్‌డీసీ ద్వారా సబ్సిడీపై సిల్కు, నూలు సరఫరా చేస్తున్నారు. రోజువారీ వ్యాపార అవసరాల కోసం మహిళా సంఘాలు, బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చారు. కరోనా కష్టకాలంలో కూడా నేతన్నలకు ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా సాయమందించారు.

జిల్లా సమాచారం..

నేత కార్మికులు	- 15,475
సొంత మగ్గాలు ఉన్న నేతన్నలు	- 4,250
చేనేత సొసైటీలు	- 42

నేతన్న నేస్తంతో లబ్ధి తిరుపతి జిల్లా సమాచారం

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నిధులు
2019 -20	3,822	రూ.9.17 లక్షలు
2020 -21	3,572	రూ. 8.81లక్షలు
2021 -22	3,125	రూ.7.50 లక్షలు
2022-23	3,171	రూ.7.51 లక్షలు
2023-24	3,447	రూ.8.28 లక్షలు

వెంకటగిరి నియోజకవర్గం నేతన్న నేస్తం లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారులు	నిధులు
వెంకటగిరి పట్టణం	1676	రూ. 21 కోట్లు
వెంకటగిరి రూరల్	94	రూ.1.12 కోట్లు
సైదాపురం	45	రూ.54 లక్షలు
రాపూరు	1	రూ.1.20 లక్షలు
కలువాయి	22	రూ.26.40లక్షలు
బాలాయపల్లి	03	రూ.3.60 లక్షలు

గత ఐదేళ్లుగా వెంకటగిరి నియోజకవర్గంలో 1841 మంది చేనేత కార్మికులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 22 కోట్లా 96లక్షలు నిధులను పంపిణీ చేసింది.

నేతన్న నేస్తం అండగా నిలిచింది



గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేసిన నేతన్ననేస్తం పథకం కార్మికులకు అండగా నిలిచింది. ఎందరో కార్మికుల దుర్భర జీవితాల్లో వెలుగులు నిపింది. దీంతో ప్రభుత్వం ద్వారా వచ్చే నేతన్న నేస్తం నిధులతో మగ్గాలను యంత్రీకరణ చేసుకుని ఆధునికత వైపు అడుగులు వేశాం. అయితే ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడవాలని కోరుకుంటున్నాం.

- కూనా మల్లికార్జున్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, చేనేత కార్మికుడు, బంగారుపేట

చంద్రబాబు హయాంలో పట్టించుకోలేదు



టీడీపీ హయాంలో చంద్రబాబు చేనేత కార్మికులను అసలు పట్టించుకోలేదు. ముడి సరుకుల ధరలు పెరిగినా ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ఏటా వారి బ్యాంకు ఖాతాలకే నేరుగా రూ.24 వేలు చొప్పున ఐదు విడతలుగా రూ.1.20 లక్షలు జమ చేశారు. నేత పనులు చేసుకునేందుకు ఆర్థిక అండ లభించింది.

-అప్పిన కాంతారావు, చేనేత కార్మికుడు, వెంకటగిరి

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి



గత జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఏటా ఇస్తున్న నేతన్న నేస్తం డబ్బులతో మగ్గానికి అవసరమైన డిజైన్ కార్డులు, జాకార్డ్ యంత్రం, మోటారు కొనుగోలు చేశాం. వృత్తి పరంగా నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకున్నాం. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకుని, ప్రత్యేక నిధులు కేటాయించి అండగా నిలవాలి.

- పింజల రాజేశ్వరి, చేనేత కార్మికురాలు, బంగారుపేట

భూమిని ఆక్రమిస్తున్నారని వినతి

ఓజిలి: ప్రభుత్వం కేటాయించిన భూమిని నాయుడుపేట మండలానికి చెందిన కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు తహసీల్దార్ పద్మావతికి మంగళవారం వినతిపత్రం అందించారు. బాధితులు అందించిన వివరాల మేరకు అత్తివరం గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 330-2లో 5 ఎకరాలు భూమిని ప్రభుత్వం ఈగా సుబ్బరామయ్యకు 1960వ సంవత్సరంలో కేటాయించారన్నారు. తమ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఈ భూమిని కొద్ది రోజులు సాగు చేసి మినుము, పెసర వంటి పంటలు పండించామన్నారు. సుబ్బరామయ్య మృతి చెందడంతో ఈ భూమి బీడుగా ఉందన్నారు. నాయుడుపేట మండలానికి చెందిన కొంత మంది సర్వే చేయించి భూమి ఆక్రమించుకుంటున్నారని తహసీల్దార్‌కు సుబ్బరామయ్య కుమారుడు ఈగ కృష్ణయ్య విన్నవించారు. ఈ భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని డీటీ మధుసూదన్‌రాజును తహసీల్దార్ ఆదేశించారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న సూళ్లూరుపేట ఆర్డీవో ఆర్ చంద్రముని

సూళ్లూరుపేట: జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, లింగ నిర్ధారణ చేస్తే కఠినమైన చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఆర్డీవో ఆర్ చంద్రముని అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం సమావేశ మందిరంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెలా అన్ని స్కానింగ్ సెంటర్ డాక్టర్లు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని 102, 104 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఓ.శ్రీనివాసులురెడ్డి, డెమో బాబు, నెహ్రూరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీ


మామిడి మొక్కలు అందిస్తున్న నాయకులు

చిల్లకూరు: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నందున మామిడి మొక్కలను ప్రతి ఇంటికి అందించేందుకు సిద్ధమైనట్లు పెళ్లకూరులోని చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రమైన చిల్లకూరులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రతి ఇంటికి ఒక మామిడి మొక్కను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్టు అధినేత చాగణం గౌరీశంకర్ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగానే ప్రతి ఇంటి ఆవరణలో ఒక చెట్టు పెరగాలనే సంకల్పంతో ఉచితంగా మామిడి మొక్కలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, నాయకులు పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్: తల్లిపాలే పుట్టిన బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యంపై డాక్టర్ వృత్తిలో ఉన్న ఎమ్మెల్యే పలు సూచనలు, సలహాలిచ్చారు. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును ప్రత్యక్షంగా తనిఖీలలో తెలుసుకున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సెజ్ యాజమాన్యాలతో మాట్లాడి సీఎస్ఆర్ నిధులతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు చేపడుతామని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. సీడీపీఓ ఉమామహేశ్వరి మూడు మండలాల అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరుకు మేం రాలేం..

పెళ్లకూరు: వివిధ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ అధికారులు బదిలీపై పెళ్లకూరు మండలానికి రావాలంటేనే భయపడుతున్నారు. బదిలీలు కొనసాగుతున్న తరుణంలో ఈ పరిస్థితి తలెత్తుతోంది. అసలే అధికార పార్టీ నేతల ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో పాటు టీడీపీ గ్రూపు రాజకీయాలతో ఈ భయాందోళన నెలకొన్నట్టు తెలుస్తోంది. ఊరికి నలుగురు నాయకులు ఉంటే ఒక్కొక్కరిది ఒక్కో ధోరణి కావడంతో అధికారులు ఒత్తిడికి గురవుతున్నారు.. అందుకే మండల స్థాయి అధికారులు పెళ్లకూరుకు వచ్చేందుకు భయపడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తహసీల్దార్‌గా నెల్లూరు కలెక్టరేట్ నుండి అనురాధను బదిలీ చేశారు. కానీ ఆమె ఇక్కడికి వచ్చేందుకు సాహసించడం లేదు. పెళ్లకూరు తహసీల్దార్‌గా ఆమెను బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చి ఐదు రోజులవుతున్నా బాధ్యతలు చేపట్టలేదు. మరో ఎనిమిది మాసాల్లో ఆమె రిటైర్డ్ అవుతున్నందున తన పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. గ్రావెల్, ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారిన పెళ్లకూరుకు బదిలీపై రావడానికి అధికారులు, సిబ్బంది ధైర్యం చేయడం లేదు.

పూడిక తీత పనులు ప్రారంభం

నాయుడుపేట టౌన్: స్వర్ణముఖి నది ముఖ ద్వారం నుంచి విన్నమాల గ్రామ చెరువుకు ఉన్న పంట కాలువలో పూడిక తీత పనులకు మంగళవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయుడుపేట, సూళ్లూరుపేట రెండు మున్సిపాలిటీలకు రూ.65 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. దీంతో పట్టణంలో ప్రధానంగా ఉన్న విన్నమాల కాలువలో పూడిక తీత పనులు ప్రారంభించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ షేక్ రఫీ, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టండి

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని పండ్లూరు గ్రామ పంచాయతీలో 87, 88, 89 సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉందని చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు శివకవి ముకుంద తహసీల్దారు గీతావాణికి వినతి పత్రాన్ని అందించారు. పండ్లూరు గ్రామంలో అనేక మంది వ్యవసాయ కూలీలు ఉన్నారని, వారికి ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను వారికి పంపిణీ చేయాలని కోరారు.

కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి

చిల్లకూరు: మానవ శరీరంలో ప్రధానమైన కంటిని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు సత్యశ్రీ సూచించారు. చిల్లకూరు సమీపంలోని శారద నగర్‌లో ఉన్న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల యాజమాన్యం సహకారంతో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరు ఎక్కువ సమయం సెల్‌ఫోన్ ఉపయోగించడం ద్వారా కంటి చూపు దెబ్బతింటుందన్నారు. అలాగే కొంత మంది ఎక్కువ సేపు కంప్యూటర్ల వద్ద కూర్చుని ఉండడంతో కూడా కంటి చూపు సన్నగిల్లుతోందని అన్నారు. చిన్నతనం నుంచి సీ విటమిన్ ఉన్న వాటిని ఎక్కువగా తీసుకోవాలని, అప్పుడే కంటి చూపు నిలకడగా ఉంటుందని అన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అద్దాలు అవసరమైన వారికి సిఫారసు చేశారు. ఆసుపత్రి పీఆర్‌ఓ సుకుమార్, నయోమి, దొరావతి తదితరులు పాల్గొన్నారు.

నివాస గృహాలను తొలగించాలని దౌర్జన్యం

దొరవారిసత్రం: తనియాలి గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీ సమీపంలోని గ్రామ కంఠం భూమిలో నివాసాలు తొలగించాలని దౌర్జన్యాలకు దిగుతున్నారని బాధితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై 12 మంది బాధిత కుటుంబాలవారు ఇన్‌చార్జి తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డికి మొరపెట్టుకుని వినతి పత్రాన్ని అందజేసి, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ గ్రామ కంఠం భూమిలో 25 ఏళ్ల నుంచి ప్రభుత్వం నిర్మించిన పక్కాగృహాలు, పూరిళ్ల నిర్మించుకుని కాపురాలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ కాలనీకి చెందిన కొందరు ఖాళీ చేయాల్సిందిగా దౌర్జన్యం చేస్తూ పలు ఇబ్బందులు పెడుతున్నారని తహసీల్దార్‌కి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన విచారణ నిమిత్తం సంబంధిత వీఆర్‌ఓను పంపి పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానమి తహసీల్దార్ తెలిపారు.

ఓజిలిలో భారీ వర్షం

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు, చిలమానుచేను, ఓజిలి, బత్తలాపురం, భట్లకనుపూరు తదితర గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయంగా మారాయి. రహదారులపై వర్షపునీరు నిలిచి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలి

డక్కిలి: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని తిరుపతి జిల్లా ఎస్ఆర్‌పీ సురేంద్రరెడ్డి, డీపీఎం పట్టాభిరెడ్డి కోరారు. మంగళవారం డక్కిలిలో వెంకటగిరి డివిజన్‌లోని డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పశువుల ఎరువులు, జీవన ఎరువులు వాడి 20 రకాల పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకునేందుకు ఆకు కూరలు, కూరగాయలు పండించుకోవాలన్నారు. పండించిన కూరగాయలను అంగన్‌వాడీలకు అందించాలని సూచించారు. పంటల సాగులో రసాయనిక ఎరువులను వినియోగించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ఏ మల్లికార్జున, మాస్టర్ ట్రైనర్ సుహర్లత, సిబ్బంది పాల్గొన్నారు.

బోల్తా పడిన కాంక్రీట్ లారీ

నాయుడుపేట టౌన్: తుమ్మూరు స్వర్ణముఖి నది బ్రిడ్జి సమీపంలో రహదారిపై మంగళవారం సాయంత్రం కాంక్రీట్ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. మేనకూరు నుంచి ఎంపీ చక్కెర పరిశ్రమ వైపు కాంక్రీట్ లోడుతో వెళుతున్న లారీ స్వర్ణముఖి నది బ్రిడ్జి సమీపంలో ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి అదుపు తప్పింది. రోడ్డు పక్కగా వెళ్లి బోల్తా పడింది. లారీ నడుపుతున్న డ్రైవర్‌తోపాటు క్లీనర్ స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని బూదనం, కోట క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు నెల్లూరుకు చెందిన మల్లికార్జున్ అనే యువకుడు నాయుడుపేటకు స్కూటీలో వెళుతుండగా తిరుమల డెయిరీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని హైవే అంబులెన్స్ సాయంతో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కడివేడుకు చెందిన శ్రీధర్‌రెడ్డి గూడూరులో పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా కోట క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన అతన్ని 108 వాహనంలో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

రాపూరు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఇలాంటి లైంగిక వేధింపులు ఎవరైనా చేస్తే వారిపై కేసులు పెట్టవచ్చన్నారు. ఎస్ఐ మాల్యాద్రి మాట్లాడుతూ బాల్యవివాహాలు నిరోధించాలని సూచించారు. చిన్నతనంలో వివాహం చేస్తే అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ఎవరైనా లైంగిక వేధింపులకు గురి చేస్తుంటే గ్రామాల్లోని మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఆడబిడ్డలను చదివించాలని ఆయన కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ సునందన మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం అందుబాటులోఉండే అంగన్‌వాడీ సిబ్బందికి బాల్య వివాహాలపై సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ సురేఖ, ఏపీఎం మాధవి,ఎ న్‌జీవోలు శ్రీనివాసరావు, సురేష్, షాహన్, మంజుల, పావని, మున్వర్‌సుల్తాన్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.